వేసుకున్న గుడ్డలు తీసేస్తే అప్పుడు సౌందర్యం నేచురల్‌గా బైటపడ్తుంది. సినిమాల వాళ్ళు పైటలు తీసేస్తారు. వంటి నంటిపెట్టుకునే దుస్తులు వేసి పరుగు లెత్తిస్తారు చెట్ల చుట్టూ - ఏదైనా నేచురల్‌గా వున్నదానికి ఆకర్షణలేదు. పొలాల్లో ఎంత మందో మనుషులు కోకలెగ్గట్టి గోచీలు పోసి పైటలు బిగించి పనులు చేసుకుంటూ వుంటారు. వర్షంలో తడిసిన మనుష్యులు ఆదరాబాదరా ఆడామగా రోడ్లమీద పరుగులెత్తు తుంటారు. ఇంట్లో ఆడాళ్ళు చిన్న బట్టకట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ ఎంగిళ్ళెత్తుతూ కంచాలు కడుగుతూ పనులు చేసుకుంటూ వుంటారు. ఇదంతా అశ్లీలం, అసభ్యం అని మనం గంతులు వెయ్యటం లేదు. ఒక పేరూ వూరూ డబ్బూ దస్కం వార్డ్ రోబునిండా రకరకాల చీరలున్న ఆడది (తారకానివ్వండి) గుడ్డకట్టలేని కడుబీదరాలు కాకపోయినప్పటికీ తక్కుతూ తారుతూ గెంతు లేస్తూంటే సంగీతం, ఆపాటలూ చెవుల్ని హోరెత్తిస్తూంటే ఆ సంస్కృతి, సభ్యత, మానం మర్యాదా మంట కలిసిపోతున్నాయని గోలెడుతున్నాం. ఆడదాన్ని బజారులో పెట్టారని అలమటిస్తున్నాం.

డబ్బులిచ్చి చూశాక చూసి లోపల ఆనందించి పైకి అసభ్యం అశ్లీలం అని గావుకేకలు పెడుతున్నాం. దటీజ్ నాట్ కరక్టు మరియు గుడ్. ఇలా కేకలు పెట్టేవాళ్ళంతా పుణ్యాత్ములు, పుణ్యాత్ములంటే వాళ్ళ శరీరాలు పాపాలుచేస్తే చెయ్యొచ్చేమోకాని వాళ్ళ ఆత్మలు పరిశుద్ధమైనవి. బజార్లో పకోడీలు కొనుక్కు తిన్నా వాళ్ళు ప్యూరిటన్స్, టన్నులకొద్ది నీతిపాఠాలు వప్పచెప్పగల్రు.

## ఆవడల శోషలిజం ఇంటూ ఆధ్యాత్మిక సోషలిజం

మొగుడు పెళ్ళాన్ని కొడితే న్యూస్ కాదు. పెళ్ళాం తిరగబడి మొగుడ్ని కొడితే అది న్యూస్ అవుతుంది. వెంకటప్పయ్య మెట్లమీంచి జారిపడితే అది న్యూస్ కాదు. నారాయణమ్మ వెంకటప్పయ్యను మెడపట్టుకు మెట్లమీంచి క్రిందకు దభాల్న త్రోస్తే అప్పుడెవరేనా చూసి రిపోర్ట్ చేస్తే న్యూస్.... అంచేత రిపోర్టర్ సాక్షాత్తూ నారద మహాముని అంశను జన్మించిన కారణ జన్ముడు. విస్సన్న చెప్పింది వేదంలాగ రిపోర్టర్ తెచ్చింది న్యూస్ - పోర్టర్ తెచ్చేది లగేజీ. అక్కడివిక్కడా, ఇక్కడివక్కడా చెప్పడంలో ఆడాళ్ళు మాంచి రిపోర్టర్స్ అని అనుక్షణం రుజూచేసుకుంటూ వుంటారు. ఆడాళ్ళు పిల్లల్ని మోసుకుంటూ తిరుగుతారు. అంచేత మంచి పోర్టర్స్ కూడా - నేను స్త్రీల దినపత్రిక ఎడిటర్నయితే - ఆడాళ్ళ చేత దెబ్బలూ, చివాట్లూ తిన్న మగాళ్ళ ఫొటోలు వేసి న్యూస్ బాక్సు కట్టి ప్రచురిస్తాను. మొగుడికంటె పొడుగ్గా లావుగా బలంగా భారంగా భయంకరంగా వుండే స్త్రీలను గురించి లేటెస్టున్యూస్ తాజాగా ఎప్పటికప్పుడు అందజేస్తాను. ఐశ్వర్యం, విద్య వుద్యోగం. అందచందాలలో భర్త తలదన్నిన స్త్రీల పాత్రచిత్రణలను వున్నదివున్నట్లుగా లేనిది లేనట్లుగా దడదడా అచ్చువేస్తాను. (సత్యభామ శ్రీకృష్ణుడిని ఎడంకాలితో

నెత్తిమీద తన్నిందని యిప్పటి కిప్పుడు ఈవేళ మనం తన్నినట్లుగా చెప్పుకుని ఆనందిస్తున్నాముకదా) ఇంతెందుకు ఆడాళ్ళందర్నీ మొదటి పేజీలోకి జుట్టట్టు కీడ్చుకొస్తాను.

సృష్టిలో అద్భుతమూ అపురూపమూనైన స్త్రీ సౌందర్యాన్ని బజారున పెట్టే ప్రకటనాపద్ధతులను తలక్రిందులుచేసి బీడిల దగ్గర్నుంచి డీసెలు ఇంజనులు, పంపుసెట్లు, సిమెంటు బస్తాలవరకు అడ్డమైనదానికి ఆడదాని చిరునవ్వులతో ప్రోత్సహించే విధానానికి స్వస్తిచెప్పిస్తాను. బిలీవిట్ ఆర్ నాట్ – ఇప్పుడు స్త్రీల చిత్రాలను అర్ధనగ్నంగా అచ్చు వేస్తున్నట్లు మా పత్రికలో పురుషుల చిత్రాలను కనీసం పావునగ్నంగానైనా ప్రచురించితీరుతాము.

హేరాయిలు రాసుకుంటే పెరిగేవయితే ఎవరి వెండ్రుకలైనా పెరుగుతాయి. సినిమా తారలే కాదు అంతా రుద్దుకుంటారు సబ్బు! సినీమాతార భర్తల చర్మసౌందర్యమును హరించు సబ్బు అంటే రోగం కుదుర్తుంది. చీరలు ఆడాళ్ళె కట్టుకుంటారు కాని మొగాళ్ళు కట్టుకోరు కదా – మొగాళ్లు కట్టుకోవాలని మనసుపడుతున్నా సిగ్గుపడి కట్టుకోలేక పోతున్నారని షో కేసుల్లో జంటిల్మనుల బొమ్మలు పెట్టించి నాజూకైన చీరల్ను ధరింపజేసి ప్రపంచాన్ని విస్మయపరుస్తాము. షో కేసుల్లో కట్టుకున్న చీరకన్నా చీరను ధరించినబొమ్మ బాగుంటుంది ఎప్పుడూ – బనీన్లు, రేజర్లు, బ్లేడ్లు, అండర్ వేర్సూ, సాక్స్, శ్లాక్స్ వగైరాలను నమ్మకంగా అమ్మించడానికి స్త్రీల రికమండేషన్ నుపయోగించే సంస్కృతి మీద దెబ్బ తీస్తాను.

మొగుళ్ళు పెళ్ళాలను తన్నడం అది బూర్జువా సంస్కృతి. పెళ్ళాలు పళ్ళేలు గిరవాటెయ్యడం మొగుళ్ళను తన్నడం అది విప్లవ సంస్కృతి. సత్యభామ సోషలిస్టే – అందుకే బూర్జువా మొగుడ్ని ఫెడీల్మని తన్నింది. అయితే పెళ్ళాం చేత అనగా నారాయణమ్మలచేత తన్నులు తినే వెంకటప్పయ్యలను రక్షించడమే విమోచనోద్యమం. బూర్జువా మొగుడ్ని సోషలిస్టు పెళ్ళాం తన్నాల్సిందే– భర్తలంటే పురుషులూ భార్యలంటే స్త్రీలుగదా – స్త్రీలు ఎప్పటికీ అణగారిన వర్గమే. అణగారినవర్గం కనుక అమ్మలక్కలంతా శోషలిస్టులుకాక మరేమవుతారు?

శ్రీవారు "పెట్టీ బూర్జువా" లాగుంటారు. అఫ్‌కోర్స్.... మా మావయ్యగారు ఆధ్యాత్మిక సోషలిస్టు... వెనక రాధాకృష్ణ పండితుడు రష్యాకు రాయబారిగా వెళ్ళినప్పట్నుంచీ మా మావగారు భగవద్గీతను. కారల్‌మార్క్సును జోడించి చదివేవారు. నెహ్రూగారు చైనాను భాయీ భాయీ అన్నంతకాలం మా మావయ్యగారు చైనా పేరు చెబితే పరవశించిపోయేవారు. నెహ్రూగారు చైనా మనకు భాయీభాయీ కాదనగానే మా మావయ్యగారుకూడా మావోని కల్క్యావతారం కాదని ఎప్పటికైనా స్పిరిచ్యుయల్ శోషలిజమే మన ఆధ్యాత్మికసంపదే ప్రపంచాన్ని రక్షించాల్సి వుంటుందని మంచి ఇమోషనల్‌గా పడక గదిలో నరసరావుపేట కుర్చీలో కూర్చుని లెక్చర్లిచ్చేవారు.

ఆధ్యాత్మిక శోషలిజం ప్లస్ ఎవరి పని వారు చేసుకోవడం మా మావగారు యింట్లో ప్రవేశపెట్టారు. ఆడాళ్ళకు గొప్ప రిలీఫ్‌గా వుండేది. ఎంగిలికంచాలు కడుక్కోవడం, బట్టలుతుక్కోవడం, ఎవరి గది వారు చిమ్ముకుని క్లీన్‌గా అట్టేపెట్టుకోవడం, బజారునుంచి సరుకులు మోసుకురావడం, ప్లాటుఫారాలమీద స్టేషన్లో కూలీలను పెట్టకుండా సామాన్లు కేరీ

చేయడం, సామాన్లు మాత్రమే రిక్షాలో వేసి ఇంటికి నడిచి రావడం ఇవన్నీ మా ఇంట్లో శోషలిజంలోని విశేషాలు. ఇతరుల(శమను స్వప్రయోజనానికి వాడుకోకూడదట. అది ఎంత తగ్గించి వాడితే అంత మంచిదట. మనకు కావలసిన పనులన్నీ మనమే చేసుకుంటే ఆడాళ్ళ శ్రమ వృధాకాకుండా సద్వినియోగమవుతుందట. పనివాళ్ళచేత పనులు చెప్పి చేయించుకోవడం అలా మిగుల్చుకున్న కాలాన్ని విలాసాదులకు అనగా పేకాట, సినిమా, నాటకం వగైరాలకు వినియోగించడం సోషల్ ఇన్‌జస్టిస్ అని మాకు చెప్పారు. అమ్మాయీ నువ్వు సినిమాలో హాయిగా కుర్చీలో అలా కూర్చుని ఆనందించే అవకాశం నీకు సాంఘికభద్రతను కలగనిస్తోరన్నమాట. నువ్వు ఐస్ క్రీం తింటున్నావంటే, లడ్డూ కొరుకుతున్నావంటే, ఖరీదైన సిల్కు లేదా వులెన్ లేదా టెరిలీన్లు ధరించి విలాసంగా, వయ్యారంగా కులుకుతున్నావంటే – ఆ ఐస్ క్రీంలు, లడ్డూలు తినడానికి నోచుకోని వారిని తల్చుకో. ఆ ఖరీదైన విలాసవస్తువులు, దుస్తులు ధరించి నువ్వు అందంగా, సంతోషంగా వుంటున్నావంటే ఆ సుఖాల్ని వేటినీ అనుభవించడానికి పెట్టిపుట్టని అభాగ్యుల్ని ఒక్కసారి జ్ఞాపకం చేసుకో – వాళ్ళకు ఏవీలేవు కాబట్టి నువ్వు ఏవీ తినకూడదు. కట్టకూడదు, కులాసాగా వుండకూడదు. ఎప్పుడూ ఏడుస్తూ అఘోరించాలి అని నేనన్ను. చాలా సింపుల్‌గా లగ్జరీలు విసర్జించి ఇతరుల శ్రమని దోచుకోకుండా ఐడియల్‌గా జీవించాలని అనేవారు.

ఆఫ్‌కోర్సు మా యిల్లు చిన్న ఆశ్రమంలా వుండేదనుకోండి. మాకు అప్పులుండేవేమో కాని ఆస్తులుండేవి కావు. డబ్బు అవసరం ఎక్కువగానే వుండేది. కాని డబ్బు ఎక్కువగా ఉండేది కాదు. ఎవరి దగ్గర పది రూపాయలనోటు వున్నా అంతా సంతోషంగా ఖర్చు చేసుకునేవాళ్ళం. యూనిఫామ్సు లేకపోయినా మంచి చీరలువున్నవి. యింట్లో అంతా కట్టుగునేవాళ్ళం. ఎవరేనా చుట్టాలు వస్తే వండినది అయిపోయి మిగిలినది మాకు చాలకపోతే వున్నదే అంతా షేర్ చేసేవాళ్ళం. అన్నం షేరింగు, చారు షేరింగు, పప్పు షేరింగు అంతా షేరింగే – ఉన్నది సమంగా పంచుకుని తినండి అని మా మావయ్యగారు చెప్పారు. ఇప్పుడు ఇండియా దటీజ్ భారత్‌లో దరిద్రాన్ని అంతా అనుభవించటం లేదు. ఎవరికి దక్కినది వారు అనుభవిస్తున్నారు. ఇది ఆవడి శోషలిజం – మా మావగారి ఆధ్యాత్మిక శోషలిజం. ఆవడి శోషలిజం కంటె చాలా మంచిది. ఇంట్లో ట్రయిచేసి చూడండి.

# లవ్ ఇన్ లబ్బీపేట....

నెత్తురు కారకుండా, గాయం కనపడకుండా కుంచెతో ఖూనీలు చేయగల్రు ఆర్టిస్టులు. చెడ్డవాళ్ళకు సుఖాలు, మంచివాళ్ళకు కష్టాలూ వచ్చినట్లు చెడ్డ కథలకి మంచి బొమ్మలూ మంచి కథలకి చెడ్డబొమ్మలూ వస్తూంటాయి. ఏ ఎండ కా గొడుగుపట్టినట్లు, ఏ కథకు